శిథిలావస్థలో అమ్మవారి ఆలయం

● పెచ్చులూడుతున్న మహంకాళి ఆలయ పై కప్పు ● భక్తులకు పొంచి ఉన్న ప్రమాదం

ముషీరాబాద్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్‌లో ప్రసిద్ధిగాంచిన మహంకాళి దేవాలయం శిథిలావస్థలకు చేరింది. ఆలయ పై కప్పు పెచ్చులూడుతూ ప్రమాదంగా మారింది. పై కప్పు ఊడి నెలలు గడుస్తున్నా మరమ్మతు పనులు చేపట్టకపోవడంతో ఎప్పుడు ఏమి జరుగుతుందో అని భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్య దోరణి వల్లే జాప్యం జరుగుతుందని భక్తులు, వివిధ పార్టీల నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

100 సంవత్సరాల చరిత్ర

వంద సంవత్సరాల చరిత్ర ఉన్న మహంకాళి దేవాలయానికి ప్రతిరోజు భక్తులు వందల సంఖ్యలో వచ్చి పూజలు నిర్వహించడంతోపాటు వివిధ రకాల వితరణలు, హోమాలు నిర్వహిస్తారు. స్థానికులతోపాటు చుట్టుపక్క ప్రాంత ప్రజలు సైతం అమ్మవారిపై అపార నమ్మకంతో వందల సంఖ్యలో తరలి వచ్చి పూజలు చేస్తారు. గత సంవత్సరం ఆలయ పైకప్పు ఊడిపోయి కిందపడిపోంది. ఆ సమయంలో భక్తులు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. విషయాన్ని ఆలయ ఈవో మహేందర్‌కుమార్ ఉన్నతాధికారులు పరిశీలించి వెంటనే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చి వెళ్లారు. ఇప్పటివరకు ఎలాంటి మరమ్మతు పనులు చేపట్టలేదు.



ఆలయంలో పెచ్చులూడిన పై కప్పు



మహంకాళి ఆలయ పై కప్పు పెచ్చులు ఊడిన ప్రాంతాన్ని పరిశీలించిన బీఆర్ఎస్ నేతలు

ఆందోళన చెందుతున్న భక్తులు



ఆలయ పైకప్పు పెచ్చులూడడంతో భక్తులు ఎప్పుడు ఏమి జరుగుతుందో నని ఆందోళన చెందుతున్నారు. కనీసం పెచ్చులు ఊడిన చోట కూడా మరమ్మతు పనులు చేపట్టడం లేదు. అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి.

\- ఏయిర్‌టెల్ రాజు,
ఆలయ కమిటీ మాజీ చైర్మన్

మరమ్మతులు చేపట్టాలి



భక్తుల కొంగు బంగారంగా నిలిచిన మహంకాళి ఆలయ పై కప్పుకు మరమ్మతులు చేపట్టాలి. భక్తులు మనోభావాలు దెబ్బతీయకుండా అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి. ఆలయాన్ని సందర్శించి కూలిన పై కప్పును పరిశీలించి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాం.

\- ముఠా జైసింహ,
బీఆర్ఎస్ యువ నాయకుడు

ఆదేశాలు రాగానే పనులు చేపడతాం

దేవాదాయ శాఖ ఉన్నతాధికారులకు సమస్యను వివరించాం. ఆదేశాలు వచ్చిన వెంటనే పనులు చేపడుతాం. మరమ్మతు పనులకు లక్షల్లో వ్యయం అవుతుంది. దేవాదాయ శాఖ నుంచి నిధుల మంజూరు, దాతల సహకారం కోసం ఎదురుచూస్తున్నాం.

\- మహేందర్ కుమార్,
ఆలయ ఈవో



పురస్కారగ్రహీతలతో అతిథులు, నిర్వాహకులు

మహిళా ప్రముఖులకు శ్రీ ధాత్రి పురస్కారాలు

చిక్కడపల్లి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): శ్రీ ఆకాంక్ష చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం చిక్కడపల్లిలోని ఓ హోటల్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పలువురు మహిళా ప్రముఖులకు శ్రీ ధాత్రి పురస్కారాలను ప్రదానం చేశారు. సంస్థ 7వ వార్షికోత్సవాలను పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా హైమావతి(పర్యావరణం), కావ్యరెడ్డి(ఫ్యాషన్ డిజైనర్), రాజరాజేశ్వరి(సంగీతం), రాధికాశ్రీనివాస్ (కూచిపూడి నృత్యగురువు)లకు పురస్కారాలను ప్రముఖ హరికథాకళాకారిణి పద్మశ్రీ ఉమామహేశ్వరి పురస్కారాలు బహూకరించి అభినందించారు. ఉమామహేశ్వరి మాట్లాడుతూ మహిళలు వివిధరంగాల్లో తమ ప్రతిభను చాటుతూ రాణిస్తున్నారని ప్రశంసించారు. యువకళా వాహిని అధ్యక్షుడు లంక లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జీవీఆర్ ఆరాధన కల్చరల్ ఫౌండేషన్ చైర్మన్ గుడిబండి వెంకటరెడ్డి, ప్రముఖ కవి రఘుశ్రీ, నిర్వాహకురాలు, రచయిత్రి పాలపర్తి సంధ్యారాణి, వ్యాఖ్యాత బుర్రా మోహనకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ఎన్ గౌతం రావు

ఏప్రిల్ 6న శ్రీరామనవమి శోభాయాత్ర

ముషీరాబాద్, బర్కత్‌పుర, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి సందర్భంగా భారతీయ అధ్యాత్మికతను చాటిచెప్పే విధంగా శ్రీరామనవమి మహాశోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా మాజీ అధ్యక్షుడు డాక్టర్ ఎన్ గౌతంరావు తెలిపారు. ఆదివారం కాచిగూడ నింబోలిఅడ్డలో కార్పొరేటర్ కన్నె ఉమాదేవి ఆధ్వర్యంలో మహాశోభాయాత్ర సన్నాహక కమిటీ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ ఎన్ గౌతం రావు మాట్లాడుతూ ఏప్రిల్ 6న సాయంత్రం 3 గంటలకు అంబర్‌పేట మున్సిపల్ గ్రౌండ్ నుంచి ఈ శోభాయాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్ యాదవ్, కోశాధికారి సూర్యప్రకాష్ సింగ్, అధికార ప్రతినిధి చిట్టి శ్రీధర్, నాయకులు కృష్ణకుమార్, సుభాష్ పటేల్, క్షీరసాగర్, అరవింద్, బల్వీర్, భీమ్‌రాజ్, రవియాదవ్ పాల్గొన్నారు.

హాస్టళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

చిక్కడపల్లి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్ పరిధిలో ఉన్న హాస్టళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా పోలీసులు చర్యలు తీసుకోవాలని ముషీరాబాద్ నియోజకవర్గం తెలంగాణ జనసమితి అధ్యక్షుడు మెరుగు శ్రీనివాస్ యాదవ్ విజ్ఞప్తి చేశారు. నేరాల అదుపునకు ప్రతి ఒక్క వ్యాపార సంస్థతోపాటు హాస్టళ్లలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. హాస్టళ్ల నిర్వాహకులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా వారిలో అవగాహన తీసుకురావాలన్నారు. మెయిన్‌రోడ్ నుంచి రెండు కిలోమీటర్ల లోపలి ప్రాంతంవరకు కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా కృషి చేయాలని చిక్కడపల్లి, ముషీరాబాద్ పోలీసులకు విజ్ఞప్తి చేశారు.

పెన్షన్ పెంపు అమలు చేయాలి: ఎన్‌పీఆర్‌డీ

చిక్కడపల్లి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఆసరా, చేయూత పెన్షన్‌ల పెంపును అమలు చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేస్తామని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) ప్రభుత్వాన్ని హెచ్చరించింది. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కె.వెంకటయ్య, అడివయ్య మాట్లాడుతూ రెండు వేల పెన్షన్‌ను నాలుగు వేలు, నాలుగు వేల పెన్షన్‌ను ఆరువేలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి పదిహేను నెలలు గడుస్తున్నా ఆ మాటే ఎత్తడంలేదని మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికైనా పెన్షన్‌ల పెంపు హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

రైలు ప్రయాణికురాలు అదృశ్యం



సుగుణమ్మ

బర్కత్‌పుర, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): రైలు ఎక్కి నగరానికి వచ్చిన ఓ మహిళ అదృశ్యమైంది. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... జోగులాంబ గద్వాల జిల్లా మల్దెకల్లుకు చెందిన సుగుణమ్మ(45) భర్త కృష్ణతో కలిసి ఈ నెల 14న గద్వాల్ రైల్వేస్టేషన్‌లో ఏపీ సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కింది. అదే రోజు సాయంత్రం 4.30 గంటలకు కాచిగూడ రైల్వే స్టేషన్‌లో దిగింది. భర్త కృష్ణ రైల్వేస్టేషన్ గేటు వద్దకు వెళ్లి వెనుకకు చూడగా భార్య కనిపించలేదు. పరిసర ప్రాంతాల్లో వెతికిన ఆమె ఆచూకీ లభించలేదు. ఆదివారం కాచిగూడ రైల్వే పీఎస్‌లో భర్త కృష్ణ ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఎల్లప్ప తెలిపారు.

బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గణేష్ మృతి



గణేష్ (ఫైల్)

ముషీరాబాద్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్‌కు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గణేష్ ముదిరాజ్ (55) ఆదివారం తెల్లవారు జామున మృతి చెందాడు. ఆయనకు రెండు సంవత్సరాల క్రితం పక్షవాతం రావడంతో ఆనాటి నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆయనకు భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించి ఉద్యమనాయకుడిగా, సామాజిక కార్యకర్తగా మంచి పేరు తెచ్చుకున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్, బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ, కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్, బీఆర్ఎస్ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్ రెడ్డి, ఆకుల అరుణ్ కుమార్, సీనియర్ నాయకుడు డి.శివముదిరాజ్, దీన్‌దయాల్‌రెడ్డి, తలారి శ్రీకాంత్ ముదిరాజ్, అజయ్ ముదిరాజ్, బీజేవైఎం నగర కార్యదర్శి అనిల్ కుమార్, డివిజన్ బీజేపీ అధ్యక్షుడు కంచి ముదిరాజ్, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కుషాల్ గౌడ్ తదితరులు గణేష్ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రాగాఢ సానుభూతి తెలిపారు. గణేష్ అంత్యక్రియలు ముషీరాబాద్‌లో శ్మశానవాటికలో జరిగాయి.



సమావేశంలో ప్రసంగిస్తున్న ఉమా సుధీర్

మహిళా జర్నలిస్టులు నిత్యం ఒత్తిడితో పనిచేస్తున్నారు

చిక్కడపల్లి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఇంటిపనుల్లో భాగస్వామ్యం వహిస్తూనే బాధ్యతాయుతమైన జర్నలిస్టుగా అనునిత్యం ఒత్తిడితో మహిళలు పనిచేస్తున్నారని ఎన్‌డీటీవీ తెలుగు రాష్ట్రాల ఇన్‌చార్జి ఉమా సుధీర్ అన్నారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్, హెచ్‌యుజే ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆదివారం త్యాగరాయగానసభలో జరిగిన జర్నలిజం మహిళలు సవాళ్లు అంశంపై సదస్సు కార్యక్రమంలో ఉమా సుధీర్ పాల్గొని మాట్లాడారు. జర్నలిజం వృత్తి సులువు కాదని మహిళలు ఈ రంగంలో రాణించడం మరీ కష్టం అన్నారు. నైతికత లేని జర్నలిజం విశ్వసనీయత కోల్పోతుందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో నిజం చెప్పినా నమ్మని పరిస్థితి వచ్చిందన్నారు. అధ్యక్షత వహించిన ఫెడరేషన్ ఉపాధ్యక్షురాలు రాధిక మాట్లాడుతూ ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో మహిళలు లీడర్‌గా ఎదగడం తక్కువ అన్నారు. అనంతరం పలువురు మహిళా జర్నలిస్టులకు అవార్డులు బహూకరించారు.

ప్రభుత్వ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలి

● ప్రగతి భవన్, మినిస్టర్ క్వార్టర్స్‌కు విద్యార్థులను తరలిస్తాం
● ప్రభుత్వానికి చెందిన అంగుళం భూమి అమ్మినా ఉపేక్షించం
● బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య

కవాడిగూడ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ హాస్టళ్లు, గురుకులాలకు సొంత భవనాలు వెంటనే నిర్మించకుంటే ప్రగతి భవన్, మినిస్టర్ క్వార్టర్స్, ఎమ్మెల్యే క్వార్టర్స్‌కు హాస్టల్ విద్యార్థులను తరలిస్తామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్ కృష్ణయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ప్రభుత్వం అంగుళం భూమి అమ్మినా ఉపేక్షించేది లేదన్నారు. హాస్టల్, గురుకులాల భవనాలకు రాష్ట్ర ప్రభుత్వం స్థలాలు కేటాయిస్తే భవనాల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు తీసుకువచ్చేలా తమ వంతు కృషి చేస్తామన్నారు. ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం, తెలంగాణ యువజన విభాగం అధ్యక్షుడు జిల్లపల్లి అంజి, నీల వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో కృష్ణయ్య పాల్గొన్నారు. 3 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న హాస్టల్, గురుకుల భవనాల అద్దెలు చెల్లించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ స్థలాలను ప్రజా అవసరాలకు వినియోగించాలే తప్ప వాటిని విక్రయించే హక్కు ఎవరికి లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ స్థలాలను అమ్మే నిర్ణయాన్ని మార్చుకోకపోతే ప్రధాని మోదీకి ఫిర్యాదు చేసి పార్లమెంటులో రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని ఎండగడతామని ఆయన హెచ్చరించారు.

ధర్నాలో బీసీ సంఘాల నేతలు వేముల రామకృష్ణ, అనంతయ్య, మల్లేష్ యాదవ్, రవికుమార్, మణికంఠ, నిఖిల్, ఆశిష్‌గౌడ్, వందలాది మంది బీసీ హాస్టల్, గురుకుల విద్యార్థులు పాల్గొన్నారు.



ఇందిరాపార్కు వద్ద జరిగిన విద్యార్థుల ధర్నాలో పాల్గొన్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య తదితరులు

ధరణి, భూ భారతి చట్టాల పుస్తకావిష్కరణ

రాంనగర్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో భూ చట్టాల పరిణామ క్రమం ధరణి, భూ భారతి చట్టాలు పుస్తకావిష్కరణ కార్యక్రమం ఆదివారం ఉదయం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో జరిగింది. ఆలిండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రచయిత కోటు పార్థసారధి రాసిన ఈ పుస్తకాలను రైతు సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు సారంపల్లి మల్లారెడ్డి, హైకోర్టు సీనియర్ అడ్వకేట్ విద్యాసాగర్, ఎస్‌బీఐ రిటైర్డ్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ కోటు మధుసుదన్‌రావు, టీపీఎస్‌వీ రాష్ట్ర కార్యదర్శి రాధేశ్యామ్, ఆలిండియా లాయర్స్ యూనియన్ నగరకార్యదర్శి రాంచంద్రారెడ్డి, రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక నాయకులు కామేష్‌బాబులు హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన ధరణి, భూభారతిచట్టాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ముఖ్యంగా రైతులు చట్టాలను తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ధరణి భూ భారతి చట్టాలకు సంబందించి రచయిత కోటు పార్థసారధి నూతన పుస్తకం తీసుకురావడం అభినందనీయమన్నారు. ఈ పుస్తకం రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.



ధరణి, భూ భారతి చట్టాలు పుస్తకావిష్కరణ చేస్తున్న సారంపల్లి మల్లారెడ్డి, జి విద్యాసాగర్ తదితరులు

బీసీ కులగణన దేశవ్యాప్తంగా చేపట్టాలి

● బీసీ ఉద్యోగుల డిమాండ్లను ప్రభుత్వాలు పరిష్కరించాలి
● ఓబీసీ సదస్సులో నేతల డిమాండ్

రాంనగర్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా కులగణన చేపట్టి జనాబా ప్రాతిపదికన రిజర్వేషన్లు అమలు చేయాలని కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ వి. హనుమంతరావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఓబీసీ ఉద్యోగుల సదస్సు జరిగింది. కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, ఓబీసీ ఉద్యోగులపై ఉన్న క్రిమిలేయర్ విధానాన్ని ఎత్తివేయాలని వీహెచ్ కోరారు. జాతీయ స్థాయిలో విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ జనాభాలో సగ భాగం ఉన్న బీసీలు సమస్యల కోసం సంఘటితంగా ఉద్యమించాలని సూచించారు. డిమాండ్ల సాధన కోసం బీసీ, ఉద్యోగ సంఘాలు ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచాలని పిలుపు నిచ్చారు. సమావేశంలో ఆలిండియా ఓబీసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి కరుణానిది, రాష్ట్ర అధ్యక్షుడు దానకర్ణచారి, ప్రధాన కార్యదర్శి పాండు, కార్యనిర్వాహక అధ్యక్షుడు రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.



ఓబీసీ సదస్సులో అభివాదం చేస్తున్న మాజీ ఎంపీ హనుమంతరావు, ఎంపీ ఆర్ కృష్ణయ్య తదితరులు



లోయర్ ట్యాంక్‌బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద మాజీ మంత్రులు కేటీఆర్, జగదీష్‌రెడ్డిల దిష్టిబొమ్మలను దహనం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

కేటీఆర్, జగదీష్‌రెడ్డి దిష్టిబొమ్మల దహనం

కవాడిగూడ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ దళిత నాయకుడు గడ్డం ప్రసాద్‌కుమార్‌ను అసెంబ్లీలో టీఆర్ఎస్ మాజీ మంత్రులు కేటీఆర్, జగదీష్‌రెడ్డిలు చేసిన వాఖ్యలను నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం నాయకులు మధు ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద కేటీఆర్, జగదీష్‌రెడ్డిల దిష్ట బొమ్మలు దహనం చేశారు. ఈ సందర్భంగా సికింద్రాబాద్ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మధు మాట్లాడుతూ బీఆర్ఎస్ దళిత ముఖ్యమంత్రిని చేస్తానని ఇచ్చిన హామీని అమలు చేయాలేదని ఆరోపించారు. బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో రాష్ట్రాన్ని అప్పుల పాలు చేయడమే కాకుండా ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేశారని ఆరోపించారు. రాజ్యసభ సభ్యులు కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షులు అనిల్‌కుమార్ యాదవ్ పిలుపుమేరకు కేటీఆర్, జగదీష్‌రెడ్డిల దిష్టిబొమ్మలను దహనం చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ట్యాంక్‌బండ్ పైనుంచి దూకి వ్యక్తి ఆత్మహత్య



రాకేష్ (ఫైల్)

కవాడిగూడ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి శనివారం రాత్రి ట్యాంక్‌బండ్ పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. లోయర్ ట్యాంక్‌బండ్ కట్టమైసమ్మ దేవాలయం సమీపంలో ఈ ఘటన జరిగింది. దోమలగూడ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం రాత్రి 11:30 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తి ట్యాంక్‌బండ్ పైనుంచి దూకడంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఆ మార్గంలో వెళ్లే వాహనదారులు 100కు ఫోన్ చేసి సమాచారం అందించగా దోమలగూడ పెట్రోలింగ్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకున్నారు. అప్పటికే అతడు మృతి చెందడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. అతడి జేబులో ఉన్న ఆధార్ కార్డు ఆధారంగా చనిపోయిన వ్యక్తి జి.రాకేష్ (43)గా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు. రాకేష్ గత కొంతకాలంగా మానసిక ఒత్తిడితో ఇబ్బంది బాధపడుతున్నట్లు అతడి కుమార్తె హారతి తెలిపింది. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దోమలగూడ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.




ఇందిరాశోభన్‌ను సన్మానిస్తున్న రాష్ట్ర వీరశైవ లింగాయత్ బలిజ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సంగమేశ్వర్, మహిళా అధ్యక్షురాలు సూర్య శ్రావణి

మహిళల అభివృద్ధికి సీఎం ప్రత్యేక కృషి

● కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకురాలు ఇందిరాశోభన్

రాంనగర్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మహిళల అభివృద్ధి, సంక్షేమం, స్వయం సమృద్ధి కోసం సీఎం రేవంత్‌రెడ్డి అనేక పథకాలను అమలు చేస్తున్నారని వాటిని మహిళలు సద్వినియోగం చేసుకోని ఆర్థికంగా ఎదగాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకురాలు ఇందిరాశోభన్ సూచించారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర వీరశైవ లింగాయత్ లింగబలిజ మహిళా సంఘం అధ్యక్షురాలు సూర్య శ్రావణి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళాదినోత్సవ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగాహాజరైన ఇందిరాశోభన్ మాట్లాడుతూ వీరశైవ లింగాయత్, లింగ బలిజ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. గౌరవ అతిథిగా పాల్గొన్న సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సంగమేశ్వర్ మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళ దినోత్సవం నిర్వహించి మహిళలను సన్మానించడం అభినందనీయమన్నారు. మహిళా సంఘం చేసే కార్యక్రమాలకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి విద్యులత, వీరమణి, శిరీష, ఉమాదేవి, సంఘం నాయకులు రాచప్ప తదితరులు పాల్గొన్నారు.

ఎంతో మధురమైంది తెలుగు భాష



నారాయణను అభినందిస్తున్న సినీనటుడు బాబుమోహన్, ధర్మారావు

చిక్కడపల్లి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): తెలుగుభాష ఎంతో మధురమైందని ప్రముఖ సినీనటుడు, మాజీ మంత్రి బాబుమోహన్ అన్నారు. ఆదివారం షామీర్‌పేటలో బొంబాయి తెలుగు సాంస్కృతిక సామాజిక సంస్థల నిర్వాహక ప్రముఖులు చేరాల నారాయణ అభినందన సభ జరిగింది. కార్యక్రమంలో ప్రత్యేక అతిథిగా పాల్గొన్న బాబుమోహన్, ఇట్క్లా, ఫాస్ ఫిలిం సొసైటీ సంస్థల వ్యవస్థాపకులు డా. కె. ధర్మారావు నారాయణను అభినందించారు. ఈ సందర్భంగా ధర్మారావు మాట్లాడుతూ బొంబాయిలో తెలుగువారిని ఐక్యం చేస్తూ పలు కార్యక్రమాలు నిర్వహించడంలో నారాయణ కృషి అమోఘం అన్నారు. ప్రముఖ జర్నలిస్ట్ రఫీ, కథక్ నృత్యగురువు పండిట్ అంజిబాబు పాల్గొన్నారు.

'హాస్టళ్లలో పనిచేసే వారి వేతనాలు చెల్లించాలి'

రాంనగర్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ జిల్లా షెడ్యూల్డు కుల అభివృద్ధి శాఖ నగరంలోని వివిధ హాస్టళ్లలో పనిచేసే వంట మనుషులు, కాపాలా దారులు, బాత్‌రూంలు శుభ్రపరిచే సిబ్బంది వేతనాలు, మ్యాన్ పవర్ సప్లై చేసే మనమాల ఏజెన్సీకి రావాల్సిన బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరుతూ ఏజెన్సీ ప్రమోటర్ దోమల మల్లయ్య కోరారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ డిమాండ్ల సాధన కోసం ఈ నెల 17వ తేదీ సోమవారం మధ్యాహ్నం నాంపల్లిలోని హైదరాబాద్ జిల్లా షెడ్యూల్డుకులాల అభివృద్ధి శాఖ ఎనిమిదవ ఫ్లోర్ కార్యాలయం వద్ద నిరాహార దీక్ష చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. నాలుగు సంవత్సరాలుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా బిల్లులు చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాపోయారు. ఆశాఖలో పనిచేస్తున్న సూపరిండింటెండ్, సీనియర్ అసిస్టెంట్లు ఉద్దేశ పూర్వకంగా బిల్లులు చెల్లించకుండా వేధిస్తున్నారని అన్నారు. బిల్లులు చెల్లించకపోతే కార్యాలయం ఎదుట ఆత్మహత్య చేసుకుంటామని మల్లయ్య హెచ్చరించారు.

బండమైసమ్మనగర్ ఆలయ వార్షికోత్సవం

కవాడిగూడ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కవాడిగూడ డివిజన్ బండమైసమ్మనగర్‌లో ఉన్న బండమైసమ్మ దేవాలయం 11వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం తెల్లవారు జామునుంచే భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజ లు నిర్వహించారు. ఈ సందర్భంగా, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ నిర్వాహకులు అన్నదానం చేశారు. పూజలో బండమైసమ్మనగర్ కమిటీ నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆర్‌వీఎల్ఎల్‌బీఎస్ బసవ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు

రాంనగర్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వీరశైవ లింగబలిజ సంఘం తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఏప్రిల్ 23 నుంచి మే 1 తేదీ వరకు ఆర్‌వీఎల్ఎల్‌బీఎస్ బసవ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నట్లు సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వెన్నె ఈశ్వరప్ప, అధ్యక్షులు పటోళ్ల సంగమేశ్వర్ తెలిపారు. ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో రాష్ట్ర వీరవైశ లింగాయత్, లింగబలిజ సంఘం సమావేశం జరిగింది. సమావేశంలో వారు మాట్లాడుతూ తమ కులానికి చెందిన యువతను క్రీడల్లో ప్రోత్సహించేందుకు తమ కులస్థులకు ఈ క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీలలో హార్డ్ టెన్నిస్ బాల్‌ను ఉపయోగిస్తామని తెలిపారు. ఈ పోటీలు జరగడం రెండోసారి అన్నారు. గత సంవత్సరం నిర్వహించిన పోటీలకు మంచి స్పందన వచ్చిందన్నారు. క్రికెట్ పోటీలలో పాల్గొన దలచిన టీమ్ సభ్యులు ఏప్రిల్ 2వ తేదిలోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలనిసూచించారు. రిజిస్ట్రేషన్ కోసం 9014988555, 9885887666 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు. సమావేశంలో సంఘం నాయకులు కల్లపల్లి రాచప్ప, రాజశేఖర్, పి భరత్, కె సోమేష్,వ రమేష్, రఘు. రాకేష్, మహేష్, విశ్వనాథ్, ఆనందప్ప, తదితరులు పాల్గొన్నారు.